క్లుప్తంగా

కోదండ రామాలయానికి విగ్రహాల అందజేత



రిటైర్డ్ గ్రంథాలయాధికారి బెజవాడ ప్రసాద్ బహూకరించిన ఉత్సవ మూర్తుల విగ్రహాలు

దెందులూరు: పోతునూరులోని కోదండ రామాలయం ఆలయానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ గ్రంథాలయాధికారి బెజవాడ ప్రసాద్ పద్మ దంపతులు ఉత్సవ మూర్తుల శ్రీ సీతా రామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను ఆలయ కమిటీకి సోమవారం అందజేశారు. ఈ నెల 28న స్వామివారి గ్రామోత్సవం నిర్వహించి ఆలయ కమిటీకి విగ్రహాలను అందజేస్తామని ప్రసాద్ తెలిపారు.

కాటి సుధాకర్‌కు ప్రజాప్రతినిధుల సత్కారం



దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

దెందులూరు: దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్ సోమవారం కొవ్వలి ఆయన నివాసంలో ప్రజాప్రతినిధులు సత్కరించారు. దెందులూరు మండలంలో కొవ్వలికి ఏఎంసీ వైస్ చైర్మన్ ఇచ్చిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, రేషన్ డీలర్ల ఏలూరు జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కాటి సుధాకర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గొల్ల వీరాస్వామి, నాయకులు బుద్దా అర్జున,డొమినిక్ అన్నారు. అనంతరం వైస్ చైర్మన్ సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు.

గణేశ్వరరావుకు నివాళి



గణేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు : పెద్దిరెడ్డి గణేశ్వరరావు సర్పంచ్‌గా అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం నారాయణపురం మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి గణేశ్వరరావు సంతాప సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మరడా మంగరావు ఆధ్వర్యంలో జరిగిన సంతాప సమావేశంలో ఎంపీటీసీ మండల ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, ఆర్‌బీకే చైర్మన్ శ్రీధర్, వార్డు సభ్యులు గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడా రమావతి తదితరులు పాల్గొన్నారు. గణేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వైఎస్సార్ కంటి వెలుగు పేదలకు వరం



కొండేపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం : గ్రామీణ ప్రాంతాలలోని పేదలు, వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం వరమని, ఈకార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శీతాలం కొండేపాడు సర్పంచ్ శీతాలం వీర లక్ష్మి అన్నారు. సోమవారం గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. 60 ఏళ్ల వయస్సు నిండిన అవ్వాతాతలకు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం గురించి వైద్యసిబ్బంది వివరించారు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. 55 మందికి కంటిపరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు పడినట్లు ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పుల వారిగూడెంలో సోమవారం పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 7,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

పేదలకు సొంత గూడు కల్పించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- గణపవరంలోని జగనన్న కాలనీలో విద్యుత్ సదుపాయం ప్రారంభం



జగనన్న కాలనీలో విద్యుత్ లైన్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : రాష్ట్రంలోని నిరుపేదలకు సొంత గూడు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గణపవరంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన విద్యుత్‌లైన్ల సదుపాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ జగనన్న సంకల్పంతో ప్రతి గ్రామంలో కొత్త ఊరు తయారవుతుందన్నారు. గత ప్రభుత్వం కనీసం పదిమంది పేదలకైనా ఇళ్లు నిర్మించి ఇచ్చిందా అన్ని ప్రశ్నించారు. చంద్రబాబు పదిహేనేళ్ల పాలనలో పేదలకు పనికిరాని ఇళ్లస్థలాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఆస్థలాలు ఏళ్ల తరబడి నిర్మాణాలు లేక పిచ్చిమొక్కలు, పెంటకుప్పలతో నిండి ఉండే వన్నారు. కాని జగనన్న ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్లస్థలాలను పూడికచేసి, లేఅవుట్లు వేసి, ఆస్థలంలో ఇళ్లుకూడా నిర్మించి ఇస్తుందని, ప్రతి కాలనీలో రోడ్లు, విద్యుత్, మంచినీటి సదుపాయాలు కల్పించి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తున్నామని, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఈ విధానం లేదన్నారు. ప్రజలు తమకు సొంతగూడు ఏర్పడుతుందని ఆనంద పడుతుంటే తట్టుకోలేక చంద్రబాబు మతిస్థిమితం తప్పి మాట్లాడటం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లస్థలాలను శ్మశానంతో పోల్చడానికి చంద్రబాబుకు నోరెలా వచ్చిందో అర్థం కావడంలేదని అన్నారు. గణపవరం జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాలలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని వాసుబాబు అధికారులను ఆదేశించారు. కాలనీలో గణపవరం, సరిపల్లె, జల్లి కొమ్మర మూడు గ్రామాలకు చెందిన వారికి ఇళ్లస్థలాలు ఇచ్చామని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలో రోడ్లు, విద్యుత్, మంచినీటి సదుపాయాలను కల్పించినందున ఇళ్లనిర్మాణం త్వరగా పూర్తిచేయించాలన్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను వాసుబాబు పరిశీలించారు. వర్షాలు ఆరంభమయ్యేలోగా ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను సమాయత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి, గణపవరం, సరిపల్లె, జల్లికొమ్మర సర్పంచ్‌లు మూర అలంకారం, చనుమూరి లక్ష్మీభవాని, కురెళ్ల వెంకటరత్నం, ఎంపీడీవో జ్యోతిర్మయి, విద్యుత్‌శాఖ అధికారులు, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, కొండేటి వెంకటరత్నం, రొంగలశ్రీను, బుద్దారపు పుల్లయ్య, అల్లాడి రఘు, చనుమూరి శివ, పాతంశెట్టి శ్రీను, మూర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాల పంపిణీ

పెదపాడు: సత్యవోలు పరిసర ప్రాంతంలోని విద్యార్థినీ విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు తెలిపారు. మండలంలోని సత్యవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ తరగుతులను సోమవారం ఘంటా ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో తరగతి నుంచి డిగ్రీ వరకు ఇంగ్లీషు, గణితం, జనరల్ నాలెడ్జ్ తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. సత్యవోలు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్‌స్పైర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ క్రీస్తుప్రకాశ్ సహకారంతో ఇంగ్లీషు గ్రామర్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాన్ని ఘంటా పద్మ శ్రీ ప్రసాదరావుతో పాటు ఎస్ కొత్తపల్లి సర్పంచ్ చేపేని రంగారావు, సొంగల ఉమామహేశ్వరరావు, వైకుంఠపు ధనుంజయ్ సహకారంతో నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయుడు ఖండవల్లి పురుషోత్తం తెలిపారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ ఫౌండేషన్ ప్రతినిధులతోపాటు శిక్షకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ అందిస్తున్న దృశ్యం

భీమడోలు : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం చిన్నారులు పలు విద్యావిషయక అంశాలపై శిక్షణ పొందారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనంతోపాటు స్పోకెన్ ఇంగ్లిషు, యోగాసనాలతో పాటు పలు ఆటలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ అందించారు. డైమండ్స్ లయన్స్ క్లబ్ కోశాధికారి, సత్యేంద్ర స్కూలు ప్రిన్సిపల్ పోలిశెట్టి వీర వెంకట సత్యనారాయణ చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ అందించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌టీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ టీచర్ బి.పరశురాముడు విద్యార్థులకు గణితంలోని మెలకువలను అందించారు. గేదెల ఈశ్వరీ చిన్నారులకు భగవద్గీత శ్లోకాలను వివరించారు. యోగా గురువులు భావనా రుషి, కురెళ్ల కిషోర్ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి, రిసోర్స్ పర్సన్లు, పాఠకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన

దెందులూరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి కంప్యూటర్‌పై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు పుస్తకాలు, దినపత్రికలు చదవటం అలవాటు చేసుకోవాలని దెందులూరు గ్రంథాలయాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాల్లో భాగంగా దెందులూరులో రాజ్యలక్ష్మి, పోతునూరులో గ్రంథాలయాధికారి జాన్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన, పుస్తకాలు, దినపత్రికలు చదివించడం తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులు పూర్తి కావస్తున్న సమయంలో సమయాన్ని వృథా కాకుండా సద్వినియోగం చేసుకుంటూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ

పెదవేగి : కోట్లాది గ్రామీణ పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిలో కూలీలకు కనీస సౌకర్యాలు కలిపించాలని కోరుతూ సోమవారం పెదవేగి మండలం లక్ష్మీపురంలో చెరువు వద్ద ఉపాధి పని చేస్తున్న కూలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టం, రెండు పూటల పనిని తీసుకువచ్చిందని అన్నారు. దీని వల్ల ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని మండిపడ్డారు. ఈ పథకాన్ని ఎత్తివేయడం కోసం బీజేపీ చేసిన అనేక కుట్రలు చేస్తోందన్నారు. ఉపాధిహామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటోసిస్టంను వెంటనే రద్దు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు విస్తరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఫీల్డు అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

మానవత భవన నిర్మాణానికి విరాళం



మావనత సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు

పెదపాడు: మానవత భవన నిర్మాణానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. సంబంధిత నగదును మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుకు అందించారు. బాణాల నరసింహారావు రూ.50 వేలు, కురెళ్ల సుభాచారి రూ.25వేలు, స్థానిక పరమేశ్వరి ఏజన్సీస్ 100 సిమెంట్ కట్టలు విరాళంగా అందించారు. వారిని మానవత సభ్యులు అభినందించారు.

మానవత నూతన కార్యవర్గం

అప్పనవీడు శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కురెళ్ల సుభాచారి, ఉపాధ్యక్షుడిగా దయాల ప్రభాకరరావు, కార్యదర్శిగా కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారిగా పాటోలు గణేష్‌బాబు సంయుక్త కార్యదర్శిగా ఘంటా ఇందిరాదేవి, ఈసీ విద్య గూడపాటి జయరామచంద్రరావు, వైద్యం దేవిశెట్టి సూర్యనారాయణ, అవేర్‌నెస్ కన్నిగంటి వెంకట సుబ్బారావు, ఎమర్జన్సీ గొల్ల మల్లికార్జునరావు నూతన కార్యవర్గంగా ఎన్నికయ్యారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన

నిడమర్రు : నిడమర్రు మండలం మందలపర్రు గ్రామంలోని గాదిరాజు గోపాలకృష్ణంరాజు కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని, వలంటీర్లను సత్కరిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు పెదనింద్రకొలను గ్రామంలోని పెద హరిజనపేట సచివాలయం పరిధిలో నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వాసుబాబు పాల్గొంటారు. ఇదే ప్రాంతంలో ఉదిసే ధర్మారావు ఇంటివద్ద నుంచి చర్చి వరకూ రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. గ్రామంలో 68 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేస్తారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పిప్పరలో మహిళలకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : పేదల సంక్షేమమే ధ్యేయంగా చిత్తశుద్ధితో నాలుగేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కోరారు. సోమవారం గణపవరం మండలం పిప్పర గ్రామ సచివాలయం పరిధిలో 159వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు తనకు అధికారం ఇస్తే పేదలను కోటీశ్వరులు చేస్తానని చెప్పడం ఈ దశాబ్దపు అతిపెద్ద జోకు అన్నారు. అధికారంలో ఉండగా పేదలను పట్టించుకోని చంద్రబాబు, అధికారంలోకి వస్తే పేదలను ఉద్ధరిస్తాననడాన్ని రాష్ట్ర ప్రజలు నమ్మేపరిస్థితి లేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నది ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికే మీఇంటి ముందుకు వచ్చామన్నారు. గత నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన పథకాల లబ్ధిని వివరించారు. పథకాలకు సంబంధించిన బ్రోచర్లు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటిసి దేవారపు సోమలక్ష్మి బాబులు, సర్పంచ్ కాకరబేబీ, మండల ఉపాధ్యక్షురాలు నీతిపూడి వీరమ్మ, ఎంపీటీసీ వీరవల్లి దానమ్మ, మండల వైఎస్సార్ కాంగ్రెస్ కన్వీనర్ దండు రాము, గ్రామ పార్టీ నాయకులు కాకర శ్యాంసన్, ఇందుకూరి చినబాబు, ముత్యాల రాంబాబు, ప్రకాష్‌రాజు, ఐఎస్ఎన్‌రాజు పాల్గొన్నారు.

ఇందుకూరిని కలిసిన వాసుబాబు

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజును సోమవారం పిప్పరలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం అమలు జరుగుతున్న తీరును వివరించారు. ఇప్పటివరకూ 159 రోజులు పూర్తిచేశామని, త్వరలోనే ఈ కార్యక్రమం పూర్తి చేయనున్నట్లు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా వాసుబాబు ఇందుకూరికి జ్ఞాపిక అందచేశారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీకి విద్యార్థుల ఎంపిక

దెందులూరు: ఉంద్రాజవరంలో ప్రతిభ గల నాగవంశీయుల విద్యార్థులకు పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ఆర్థిక సహకారం అందించేందుకు ఎంపిక కార్యక్రమం పూర్తి చేశామని నాగవంశీయుల సంఘం అధ్యక్షుడు కాలా శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం ఉంద్రాజవరంలో ఆయన మాట్లాడుతూ తన తండ్రి కాలా నర్సింహరావు జ్ఞాపకార్థం పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం ఒక్కొక్కరికి రూ. 10 వేలు మూడేళ్లుగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం కూడా టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారిని ఎంపిక చేశామన్నారు.

శ్రీనివాసరావుకు నివాళులర్పించిన కొఠారు

పెదవేగి : అనారోగ్య కారణంగా కుటుంబంలోని వ్యక్తిని కోల్పోవడం ఎవ్వరూ తీర్చలేని లోటని ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. సోమవారం పెదవేగి మండలం బాపిరాజుగూడెంలో చింతలపూడి రమణయ్య అన్నయ్య చింతలపూడి శ్రీనివాసరావు(57) గుండెపోటుతో మరణించగా ఆయన భౌతిక కాయానికి కొఠారు రామచంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అన్ని విధాలుగా అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. ఈ పరామర్శలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, మన్నె బాబూరావు, బోట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి



అమ్మపాలెంలో నిమ్మతోటను పరిశీలిస్తున్న రైతు సంఘ నేత శ్రీనివాస్

పెదవేగి : సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పెదవేగి మండలం అమ్మపాలెంలో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న నిమ్మ, కొబ్బరి, జామ తదితర పంటలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. కష్టపడి పండిస్తున్న నిమ్మకాయలకు కనీస ధరలు రాక నష్టపోతున్నామంటూ రైతులు రైతు సంఘం నాయకుల వద్ద వాపోయారు.నిమ్మ రైతు కొఠారు చంద్రరావు నిమ్మతోట పరిశీలించగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న నిమ్మకాయలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రావడం లేదని నిమ్మ రైతు చెప్పారు.ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని ప్రభుత్వం ఒకవైపు ప్రోత్సహిస్తోందని, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో తగిన గిట్టుబాటు ధరలు రాక సాగు చేస్తున్న రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిలో నిమ్మకాయలకు మార్కెట్‌లో కేవలం రూ.15 మాత్రమే ధర వస్తోందని చెప్పారు. కూలీ ఖర్చులు, రవాణా ఖర్చులు కూడా రైతుకు రావడం లేదన్నారు.. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. చందు సత్తిబాబు, కొఠారు చంద్రరావు పలువురు రైతులు పాల్గొన్నారు.

అమరావతిలో పట్టాల పంపిణీకి మద్దతు

దెందులూరు: అమరావతిలో పేదలకు పెద్ద ఎత్తున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాల పంపిణీ నిర్ణయాన్ని మాలమహానాడు స్వాగతించి మద్దతునిస్తోందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు. సోమవారం కొవ్వలిలో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వేలాదిమంది పేదలకు శాశ్వత నివాసం కల్పించే దృక్పథంతో కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి పెద్ద మనస్సుతో పట్టాలు పంపిణీకి శ్రీకారం చుడుతుంటే కొందరు పేదలకు పట్టాలు అడ్డుకునేలా వ్యాఖ్య లు చేయడం దురదృష్టకరమన్నారు. ఏ రాజకీయ పార్టీ అయి నా మంచిచేసే వారిని అభినందించాలని, పేదల జీవన విధానానికి తోడ్పాటు సహకారం అందించేలా తప్ప అడ్డుపుల్ల వేసే విధంగా వ్యవహరించకూడదన్నారు. చంద్రబాబు గతంలో ఈ తరహా చర్యలు చేస్తేనే ప్రజలు తిరస్కరించారని అన్నారు. పేదలకు ఇళ్లు ఇచ్చేందుకు ఆయన ఆయన అడ్డుపడటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చేస్తున్న ఈ బృహత్తర కార్యక్రమానికి మాలమహానాడు పూర్తి మద్దతు సహాయ సహకారాలు అందిస్తోందని గొల్ల కిరణ్ అన్నారు. ఆయన వెంట కడియం జాన్‌బాబు, సుధాకర్, గొల్ల విల్సన్ తదితరులున్నారు.

సంక్షేమ పాలనలో సంతోషంగా ప్రజలు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- జగన్నాథపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



వృద్ధులకు పథకాల బ్రోచర్ అందించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు

పెదవేగి : సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ప్రభుత్వానికి మరో సారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం జగన్నాథపురంలో స్థానిక సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏ ఇంట్లో ఏ ఏ పథకాల ద్వారా ఎంత మేరకు లబ్ధి చేకూరిందో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అందిస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలంతా సాదర స్వాగతం పలుకుతున్నారన్నారు. నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందామని ప్రజలు చెబుతున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి తమకు మళ్లీ మళ్లీ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో ఏవైనా లోపాలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి ఆయన సూచించారు.

ఘన స్వాగతం

ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టి ఆహ్వానం పలికారు. నాయకులు, యువత పూలమాలలు, భారీ బాణసంచా కాల్పులతో అట్టహాసంగా సందడి చేశారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, విజయరాయి సొసైటీ అధ్యక్షులు పాలడుగు సత్యనారాయణ(పెదబాబు), మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణ్ రావు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, మేడికొండ కృష్ణారావు, మండల కన్వీనర్ కేశన సతీష్, ఎంపీటీసీ రాచప్రోలు చంద్రరావు, స్థానిక నాయకులు పర్వతనేని రామచంద్రరావు, బలుసు శ్రీనివాసరావు, తాడేపల్లి విజయ్‌కుమార్, మనికొండ చంద్రరావు, భీమడోలు శౌరి, నేరెళ్ళ రాజ, పర్వతనేని బసవశంకరం, రాచప్రోలు రాజరామ్మోహనరావు, వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్, గంధం శౌరి, ఏసుబాబు, మానుకొండ చంద్రరావు, కొలికిపాముల రాంబాబు, సురేష్, వన్నెకూటి విజయరాజు, రాచప్రోలు హరిబాబు, వన్నెకూటి అనిల్, వన్నెకూటి అశోక్, తాడేపల్లి అనిల్, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.